క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అంశాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సమావేశానికి అధికారులు, కౌన్సిల్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా బోనాలు



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

రాజుపాళెం : రాజుపాళెం గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మంగళవారం గ్రామంలోని భైరవుడు, పెద్దమ్మ, గంగమ్మకు తప్పెట్లు, మేళతాళాలతో బాణసంచా పేల్చుతూ, చల్ల ఎత్తుకుంటూ వచ్చి మహిళలంతా బోనాలను సమర్పించారు. అమ్మవారికి జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మండల అభివృద్ధికి తోడ్పడండి



జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డిని సత్కరిస్తున్న వెంకటసుబ్బయ్య

మైదుకూరు : మైదుకూరు మండల అభివృద్ధికి తోడ్పడాలని మైదుకూరు మండల వైస్ ఎంపీపీ చిన్న కొండమ్మ భర్త వైఎస్సార్సీపీ నాయకుడు నానుబాల వెంకటసుబ్బయ్య జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డిని కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్మన్ చాంబర్లో మంగళవారం వెంకటసుబ్బయ్య రామగోవిందరెడ్డిని కలిసి జెడ్పీ చైర్మన్గా ఎన్నికైనందుకు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మైదుకూరు మండలానికి అవసరమైన నిధులను కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వెంకటసుబ్బయ్య వెంట వైఎస్సార్సీపీ నాయకుడు సిరివెళ్ల పుల్లయ్య ఉన్నారు.


నూతన కమిటీ ఎన్నిక



ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

చాపాడు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం చాపాడు మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చాపాడు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడుగా మైల కాల్వ రమేష్, ఉపాధ్యక్షుడుగా సమ్మటూరి సుబ్బరాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్గా మైల కాల్వ శివరాం, కార్యదర్శులుగా బాషా, సురేష్, ఓబులేసు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేఎన్ రాజు మాదిగ, వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నెం చిన్న సుబ్బయ్య యాదవ్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాతయ్య బాబు మాదిగ, నియోజకవర్గ ఇన్చార్జి చుక్క జీవన్, సీనియర్ నాయకులు రామసుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డాక్టరేట్ ప్రదానం



కృష్ణనాయక్

పోరుమామిళ్ల: సగిలేరు డాక్టర్ అంబేడ్కర్ గురుకులంలో జంతుశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న కృష్ణనాయక్కు మంగళవారం నెల్లూరులోని విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం జంతుశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపీకృష్ణ పర్యవేక్షణలో 'ట్రాన్స్ క్రిప్టొమిక్ ప్రొఫైల్ ఇన్ కార్బస్ డీజీమ్ ఇన్యూస్డ్ డెవలప్మెంట్ ఎఫెక్ట్స్ ఇన్ జీబ్రా ఫిష్ లార్వే అండ్ ఎంబ్రియా' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన పత్రంపై నెల్లూరు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇవ్వడానికి సహకరించిన అందరికీ కృష్ణనాయక్ కృతజ్ఞతలు చెప్పారు.

నివాళి



ఇబ్రహీం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: పట్టణానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త శెట్టిపల్లె ఇబ్రహీం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మంగళవారం ఇబ్రహీం మృతదేహానికి నివాళి అర్పించారు. నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల కన్వీనర్లు సీఎం బాషా, హనుమంతారెడ్డి, మస్తాన్, సాయి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తా

- దేవాలయం కంటే పవిత్రమైంది ఆస్పత్రి
- జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తానని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ భరోసా ఇచ్చారు. దేవాలయం కంటే ఆస్పత్రి ఎంతో పవిత్రమైందని, ఇలాంటి దేవాలయంలోకి మద్యం తాగి వచ్చినా, సిబ్బందితో అమర్యాదగా ప్రవర్తించినా సహించేది లేదని హెచ్చరించారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్తో పాటు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కమిటీ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో అన్ని విభాగాల వైద్యులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రికి కావలసిన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది గురించి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్బాబును అడిగారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు, సీఎస్ ఆర్ఎంఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే నర్సింగ్ సిబ్బంది కొరత వేధిస్తోందని తెలిపారు. రాత్రి సమయాల్లో ఒక్కో స్టాఫ్ నర్సు మూడు, నాలుగు వార్డులు చూసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది 40 వేలకు పైగా ఓపీ నమోదైతే ఈ ఏడాది 30 వేలు మాత్రమే ఓపీ జరిగిందన్నారు. 25 శాతం మేర ఓపీ ఎందుకు తగ్గిందో సరి చూసుకోవాలన్నారు. ప్రజలకు అందించే వైద్యం విషయంలో నిర్లక్ష్యం పనికి రాదని కలెక్టర్ అన్నారు.

మెరుగైన వైద్యాన్ని అందించాలి

జిల్లా ఆస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువ మంది పేదలు, మధ్య తరగతి వాళ్లే ఉంటారని తెలిపారు. సకాలంలో వైద్యం అందిస్తే వాళ్లు ఎంతగానో సంతోష పడతారని కలెక్టర్ అన్నారు. వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు ఏం కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నాబార్డ్ కింద రూ. 13.86 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో అత్యాధునిక బిల్డింగ్ను నిర్మించాలన్నారు. గైనకాలజీ, ఆర్థో విభాగాల్లో పురోగతి బాగా కనిపిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇంకా మెరుగైన వైద్యాన్ని అందించాలని చెప్పారు. పారిశుద్ధ్యం విషయంలో రాజీ పడొద్దన్నారు. పారిశుద్ధ్యం బాగలేకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ప్రొద్దుటూరులోని ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల సేవలను వినియోగించుకుంటామని కలెక్టర్ తెలిపారు.

విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందాలి

జిల్లా ఆస్పత్రిలో పేదలకు విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. ఇక్కడ అన్ని రకాల వైద్య సదుపాయాలు ఉన్నాయని, వైద్యులు, సిబ్బంది సేవాదృక్పథంతో సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి వస్తే తమ ఆరోగ్య సమస్యలన్నీ సమసిపోతాయనే నమ్మకంతో ప్రజలు ఇక్కడికి వస్తారన్నారు. వైద్యులు వారిని ప్రేమతో పలకరించి చికిత్స చేయాలని సూచించారు. మన ఆస్పత్రికి ఏం కావాలన్నా సాయం చేయడానికి కలెక్టర్ సిద్ధంగా ఉన్నారన్నారు. ఆస్పత్రిలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే సమావేశం దృష్టికి తెచ్చారు. వీటితో రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆస్పత్రిలోని వేకెన్సీ లిస్టు ఇస్తే మంత్రి సత్యకుమార్తో మాట్లాడి భర్తీ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ఆస్పత్రి బయట సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యుడు బద్వేలి శ్రీనివాసులరెడ్డి సూచించారు. అవసరమైన స్థలాన్ని చూడాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు చెప్పారు. . సమావేశంలో ఆర్డీఓ సాయిశ్రీ, కమిటి సభ్యులు డాక్టర్ పద్మజ, డాక్టర్ వరుణ్కుమార్రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ త్యాగరాజరెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, డీఎంహెచ్ఓ నాగరాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్బాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శివప్రసాద్ రెడ్డి, ఆర్ఎంఓ రూపానంద్ పాల్గొన్నారు.

తీరని కష్టం.. అపార నష్టం

- రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

కాశినాయన : అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఇటుగుల్లపాడు, సావిశెట్టిపల్లె గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి, సజ్జ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి నేలకూలడంతో అన్నదాత కోలుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలోని కాశినాయన మండలంలో ఎక్కువగా రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తారన్నారు. అరటి, బొప్పాయి, జామ, దానిమ్మ, చీనీ పంటలైన ఉద్యాన పంటలు దాదాపు 4 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారని తెలిపారు. 5 రోజుల క్రితం కురిసిన వర్షం, గాలికి అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి అరటి పంటను రైతులు సాగు చేశారని, తీరా పంట కోతదశకు వచ్చినప్పుడు పంట పడిపోవడం బాధాకరమన్నారు.

కూటమి ప్రభుత్వం విఫలం

గత ప్రభుత్వంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వంద రోజులలోపల నష్టపరిహారం అందేదని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వమే పంటలకు ఉచిత బీమా పథకాన్ని అమలు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో పంటల బీమాపై సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతాంగానికి ఇచ్చిన హామీల అమలులో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. నిండు గెలలతో ఉన్న అరటి తోటలు నేలపాలు కావడంతో రైతుల ఆవేదన అరణ్య రోదనగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడం దారుణమని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పండ్ల తోటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ తరఫున ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జిల్లా సెక్రటరీ యాక్టివేట్ కన్వీనర్ ప్రభాకర్రెడ్డి, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, నాగసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, బాలయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఇటుగుల్లపాడులో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

'వైఎస్సార్సీపీ వల్లే శివచంద్ర సర్పంచ్ అయ్యాడు'



మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వల్లే కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్గా ఎన్నికయ్యాడని వైఎస్సార్సీపీ 11వ వార్డు మెంబర్ డిష్ లక్ష్మినారాయణరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లె సర్పంచ్గా కావాలన్నది శివచంద్రారెడ్డి చిరకాల కోరిక అన్నారు. గత ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు మరో నాయకుడు శివచంద్రారెడ్డి విజయానికి సహకరించారన్నారు. వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యులందరూ ఆయన విజయం కోసం పనిచేశారన్నారు. ప్రస్తుతం ఆయన పేరు చెప్పినా శివచంద్రారెడ్డి ఓర్చుకోలేరన్నారు. గతంలో సర్పంచ్ గురుస్వామిపై శివచంద్రారెడ్డి సతీమణి శోభారాణి పోటీ చేసి డిపాజిట్ కోల్పోయిన విషయాన్ని గుర్తు తెలుసుకోవాలని సూచించారు. మత్స్య కాలనీ వార్డు మెంబర్ ఎన్నికలకు సంబంధించి ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తే కానీ ఆయన కుమారుడు విజయం సాధించలేదన్నారు. ఖాదరబాద్ గ్రామానికి చెందిన శ్మశాన వాటిక అభివృద్ధి పేరుతో సర్పంచ్ రూ.40లక్షలు స్వాహా చేశారని ఆరోపించారు. గోపవరం ఉపసర్పంచ్ అభ్యర్థి రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీకి సంబంధించి గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ వార్డు సభ్యులు 19 మందితోపాటు సర్పంచ్ విజయం సాధించారన్నారు. ఆ ప్రకారమే ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించి ఒప్పందం జరిగిందన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, వంగల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం పంచాయతీ ద్వారకానగర్ శ్రీకోదండ రామస్వామి దేవస్థాన ఆవరణలో మంగళవారం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఎద్దుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఉత్కంఠగా సాగిన ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు.

వైఎస్ జగన్ అంటే భయమెందుకు?

చాపాడు: కూటమి ప్రభుత్వ పాలన రాక్షస రాజ్యాన్ని తలపిస్తోందని వైఎస్సార్సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన కురబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పర్యటనకు వస్తుంటే పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. జగన్ అంటే కూటమి సర్కారుకు భయమెందుకని ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత, వైఎస్ జగన్ పర్యటను అడ్డుకుంటున్నామని భయభ్రాంతులకు గురి చేసినా.. పోలీసులు అడుగడుగునా నిషేధాజ్ఞలు విధించినా పర్యటన దిగ్విజయంగా సాగిందని చెప్పారు.

'అన్యాయంగా కేసు నమోదు చేశారు'

ప్రొద్దుటూరు : అధికారులు అన్యాయంగా తనకు సంబంధం లేని బియ్యం నిల్వలు చూపి కేసు నమోదు చేశారని డీలర్ దస్తగిరి వాపోయారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్లుగా తాను పెన్నానగర్లో 124వ రేషన్ షాప్ను నిర్వహిస్తున్నానని తెలిపారు. టీడీపీ కార్యకర్త షరీఫ్కు రేషన్ షాప్ను అప్పగించారన్నారు. టీడీపీ నాయకులు తన షాప్ను బలవంతంగా తొలగించడంతో తాను కోర్టును ఆశ్రయించానన్నారు. కోర్టు ఆదేశాలతో ఈ నెలలోనే రెవెన్యూ అధికారులు తనకు బియ్యం మంజూరు చేశారని, పంపిణీ పూర్తి కాకముందే మరో ఇంటిలో 19 బస్తాలు అధికంగా ఉన్నాయని కేసు నమోదు చేశారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునను కలిసి ఈ విషయాన్ని వివరించానని డీలర్ తెలిపారు.

హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు రామయ్య

ప్రొద్దుటూరు: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య విమర్శించారు. ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పేదల సొంతింటి కల ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్లు, సాగుభూమి సాధనకై రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సీపీఐ రాష్ట్రసమితి పిలుపులో భాగంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్లు, సాగుభూమి సాధనకై రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నమ్మి కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కిస్తే గడిచిన పది మాసాల్లో పేదలకు అవగింజంతైనా ప్రయోజనం కలగలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కదిలి వచ్చి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సీపీఐ ఏరియా సమితి కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సభ్యులు వై.హరి, చంద్రశేఖర్, మద్దిలేటి, యేసోబ్, ప్రమీల, సుజాత, చెన్నమ్మ, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, రాహుల్ పాల్గొన్నారు.

శ్వాస మీద ధ్యాసతో మేధా సంపత్తి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దేశ్వరరావు

ప్రొద్దుటూరు : మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం తిరుపతి ఆధ్యాత్మికత సొసైటీ ధ్యానర్షి కంచి రఘురాం మార్గదర్శకత్వంలో 108 తరగతుల నిర్వహణలో భాగంగా చాపాడు మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వి.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ×శ్వాస మీద ధ్యాస₹ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాసతో మేధా సంపత్తి సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు జ్ఞాపక శక్తిని, మేధా సంపత్తిని పెంచుకొని పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలలో సులువుగా అధికమించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. ఉన్నత స్థానాల్లో నిలిచి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు రామ్మోహన్రెడ్డి, నరసింహాస్వామి, సుకుమార్రెడ్డి, ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ ఎం.రజనీకాంత్రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గో నిర్వాహకులపై డిపో మేనేజర్ ఆగ్రహం



కార్గో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఎం

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో కార్గో నిర్వాహకుల వ్యవహార శైలిపై బద్వేలు డిపో మేనేజర్ జనార్దన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరుమామిళ్ల బస్టాండులో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించేందుకు ఆయన మంగళవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కార్గో ఆఫీసును పరిశీలించారు. ప్రజలను విచారించారు. కార్గో కార్యాలయాన్ని ఎప్పుడు పడితే అప్పుడు మూసివేయడం, అధిక చార్జీలు వసూలు చేయడంపై మేనేజర్ నిర్వాహకులపై మండిపడ్డారు

పారిశుద్ధ్య నిర్వహణపై మండిపాటు

బస్టాండులో మరమ్మతు పనులు జరుగుతున్నందున పారిశుద్ధ్యం లోపించింది. దీంతో బస్టాండును పరిశుభ్రంగా ఉంచాలన్న బాధ్యత తెలియదా? అని పారిశుద్ధ్య సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ పోరుమామిళ్ల బస్టాండును మరమ్మతు పనులు త్వరలో పూర్తి చేసి, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఆటోల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, కార్గో సేవలు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త పడదాం



ఆశా కార్యకర్తలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

ప్రొద్దుటూరు రూరల్ : తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమంలో 44 మంది ఆశా కార్యకర్తలకు డ్రెస్ కోడ్ భాగంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మహిళల దీర్ఘకాలిక ఆరోగ్య శ్రేయస్సుకు వైద్య సిబ్బంది ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి విరేచనాల వల్ల కలిగే ప్రాణనష్టం ఆపుటకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సీహెచ్ఓ కృష్ణమ్మ, హెల్త్ సూపర్వైజర్ వరప్రసాద్, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గర్భిణులు బలమైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి తెలిపారు. మండలంలోని చౌడూరు సెక్టార్ పరిధిలోని గోపవరం గ్రామ పంచాయతీ క్వీన్ మేరి స్కూల్లో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లల పెరుగుదలపై అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఈశ్వరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడీ పోస్టులు కొనసాగించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను యథావిధిగా కొనసాగించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలో 199 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను ఇతర సబ్జెక్టులకు మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. దీని వల్ల విద్యార్థులు క్రీడలకు దూరమై జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా మారే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాయమ విద్యను ప్రోత్సహించకుంటే విద్యార్థులకు శారీరక ఫిట్నెస్ లేక రక రకాల జబ్బులతో బాధపడాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం వ్యాయమ విద్యను ప్రోత్సహించేందుకు వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు దోహదపడుతామని పేర్కొన్నారు.

మెరిసిన కడప బిడ్డ

- భారత క్రికెట్ జట్టులోకి ఎంపికైన శ్రీచరణి
- యర్రంపల్లె నుంచి శ్రీలంక టోర్నీకి
- ఉమెన్ ప్రీమియర్ లీగ్లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున రాణింపు

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం యర్రంపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖరరెడ్డి, రేణుక దంపతుల కుమార్తె శ్రీచరణి. తండ్రి ఆర్టీపీపీలో ఎలక్ట్రికల్ ఫోర్మెన్. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్లో చదివింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్లోని లేపాక్షి జూనియర్ కళాశాలలో పూర్తిచేసింది. వీఎన్పల్లె వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతూ క్రికెట్లో రాణిస్తోంది.

అండర్-19 నుంచి భారత జట్టు స్థాయికి....

2017-18లో క్రికెట్లో జిల్లా అండర్-19 జట్టుకు ఎంపికైంది. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. అదే ఏడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. జిల్లాకు చెందిన క్రికెట్ శిక్షకులు ఖాజామైనుద్దీన్, మధుసూదన్రెడ్డి మార్గదర్శకత్వంలో ఎన్నో మెలకువలు నేర్చుకుంది. 2021లో అండర్-19 చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా-సి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణి 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. 2023లో బీసీసీఐ సీనియర్ అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ మ్యాచ్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి కర్నాటక జట్టుపై 7వికెట్లు, అండర్-23 మ్యాచ్లో రాజస్థాన్ జట్టుపై 5వికెట్లు తీసి ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్గా, లెఫ్ట్ హ్యాండ్ బ్యాట్స్ ఉమెన్గా నిలకడగా రాణిస్తోంది. శ్రీచరణి ఆట నైపుణ్యం గుర్తించిన డబ్ల్యూపీఎల్ ప్రతినిధులు ఢిల్లీ క్యాపిటల్స్కు రూ.55 లక్షలతో ఎంపిక చేసుకున్నారు. తాజాగా ఏప్రిల్ 27 నుంచి జరిగే ముక్కోణపు వన్డే సిరీస్కి నల్లపురెడ్డి శ్రీచరణి తొలిసారి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..


చిన్నప్పటి నుంచి ఆటలపై ఇష్టం చూపెట్టే శ్రీచరణిని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. అథ్లెటిక్స్లో రాణిస్తున్న శ్రీచరణి క్రికెట్పై ఆసక్తి చూపగా అమ్మానాన్న మొదట సందేహించారు. క్రికెట్పై ఉన్న ఆసక్తిని గమనించిన మామ కిశోర్కుమార్రెడ్డి శ్రీచరణిని ప్రోత్సహించారు. సరదాగా మొదలు పెట్టిన క్రికెట్ ఇప్పుడు సర్వస్వం అయింది. భారత జట్టు స్థాయికి చేరుకోవడంతో ఓవైపు తండ్రి చంద్రశేఖరరెడ్డి, మరోవైపు మామ కిశోర్కుమార్రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సాహం ఉంటే అమ్మాయిలు కూడా ఎందులోనైనా రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సీఏవైడీతో శ్రీచరణి

సీఏవైడీ హర్షం...

భారత జట్టులో స్థానం సంపాదించి ముక్కోణపు టోర్నిలో శ్రీలంక టూర్కు శ్రీచరణి ఎంపిక కావడంపై క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్ష కార్యదర్శులు ఎం భరత్రెడ్డి, ఏ రెడ్డిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. కడప గడపలో శిక్షణ పొందిన శ్రీచరణి అంచెలంచెలుగా ఎదుగుతూ క్రికెట్ రంగంలో రాణిస్తున్న వైనాన్ని వారు వివరించారు. భారత జట్టుతో సుస్థిర స్థానం సంపాదించే ప్రతిభ శ్రీచరణిలో ఉందని వారు అభిప్రాయపడ్డారు.



కుటుంబ సభ్యులతో శ్రీచరణి